# బుచ్చిబాబు భ్రమ



రచన : శ్రీ శ్రీరాజీ

పాల మీగడ లాంటి వెన్నెల డాబా అంతట పరచుకుంది. చల్లని గాలి మెల్లగా వీస్తుంది. సన్నజాజులు పరిమళాలు వెదజల్లుతున్నాయి.

కానీ, బుచ్చిబాబు మాత్రం ఆ వాతావరణాన్ని భరించలేకపోతున్నాడు. నిజమే, మరి, రెండు రోజుల క్రిందటే అతని హృదయం బండ రాయిగా మారిపోయింది. దానిమీది కెవరైనా సోడాబుడ్డి విసిరతే, అది ముక్కలూ చెక్కలూ అవవలసిందేకాని, అతని హృదయం మాత్రం కించిత్ చలించదు. బరువుగా కళ్ళు మూసుకొని వాలు కుర్చీ వెనుకకు వాలిపోయాడు.

ఇంటి పని పూర్తిచేసిన పార్వతి పాలు పట్టుకొని మేడమీదికి వచ్చింది. పెళ్ళయిన మొదటి రోజుల్లో బుచ్చిబాబు ఆమె రాకను కనిపెట్టి కళ్ళు మూసుకొని నిద్రపోయినట్లు నటించేవాడు. ఆమెచేత బ్రతిమాలించుకునేవాడు. కాని...యిప్పుడతను అలా చేయలేకపోతున్నాడు. గరళంలాంటి బాధను మింగుతూ కళ్ళు మూసుకొనే ఉన్నాడు.

'పాలు తీసుకోండి' అతి నెమ్మదిగా పార్వతి భర్తను పిలిచింది.

'అవసరంలేదు.' అతను కనురెప్పలు విప్పనేలేదు.

'అదేమిటండీ? భోజనం పూర్తిగా మానేశారు. పాలు వద్దంటున్నారు...మీకు ఆకలివేయదా, ఏం?' ఆమె బ్రతిమాలింది.

ఈసారి బుచ్చిబాబుకు 'ఇన్ఫినిటీ' కోపం వచ్చింది.

'వద్దని చె[illegible]దూ? తిరిగి తీసుకెళ్లు...నాకేమీ అవసరంలేదు. నన్ను ఒంటరిగా ఉండనీ.' అతని మాటల్లో అవ్యక్తమైన బాధ ఆమెకు తెలియకపోలేదు. ఆ మాటల్లో కరుకుదనంకు పార్వతి మ్రాన్పడిపోయింది. ఆమె కళ్ళలో నీళ్ళు సుళ్లు తిరిగాయి.

'ఏమండీ? మొన్నటినుండి మిమ్మల్ని చూస్తున్నాను. ఎందుకో, మీ అంతట మీరు బాధపడతారు. అడిగినా, చెప్పరు ఆ బాధను నేనుకూడ పంచుకోకూడదా? నేను మీ భాగస్వామినికాదా? ముందెప్పుడైనా మీరిలా ప్రవర్తించారా? ఎందుకండి, మీరు బాధపడి నన్ను బాధపెడతారు?' ఆమె కళ్ళలోని నీరు 'టప్ టప్'మని అతని పాదాలమీద పడింది.

'నన్నెందుకు వేదిస్తావ్? ప్లీజ్, వెళ్లు. నన్నిలా ఉండనీ.' బుచ్చిబాబు గుండె మెలికలు తిరిగిపోపొంది, తీరని తాపంతో రెండు చేతులతో ముఖాన్ని చాటుచేసుకున్నాడు, ఆమెను చూడాలని కిష్టంలేక.

పార్వతి మరేమీ మాట్లాడలేదు. వడివడిగా అక్కడ నుండి కదిలిపోయింది.

మనసు 'పగిలిన అద్దం' అయినప్పుడు దానిమీద ఎవరు అడుగువేసిన గాజు పెంకులు గుచ్చుకోకమానవు.

బెల్జియం అద్దంలాంటి బుచ్చిబాబు మనసుమీద ఓ పెద్దరాయి పడింది. క్షణంలో ముక్కలు ముక్కలైపోయింది. ఆ పగిలిన గాజు పెంకుల్లో నీలిరంగులు పులుముకున్న తన ముఖాన్ని చూల్లేక క్షణ క్షణం అంపపుకోత ననుభవిస్తున్నాడు.

సరిగ్గా రెండు రోజుల క్రితం.

చల్లని సాయంత్రం వేళ-

రంగుల పిట్టలు నీలాకాశంలో పల్టీలు కొడుతున్న సమయం,

బుచ్చిబాబు ఫైల్లు మూసి ఏదో నంబరు బస్సెక్కి పది నిమిషాల్లో పూర్ణా మార్కెట్ చేరుకున్నాడు. తన మనసుతీరా మల్లెపూలు కొన్నాడు. మరో పది నిమిషాల్లో ఇల్లు చేరుకున్నాడు. పార్వతికి మల్లెపూలంటే ఎంతో

యిష్టం. అందునా, అతను స్వయంగా ఆమె తలలో అలంకరిస్తే, ఆమె ఎంతగానో మురిసిపోతుంది.

'పారూ; మల్లెపూలంటే నీకెందు కింత యిష్టం?'

'మీ మనసు మల్లెపూవులాంటిది గనుక.'

ఆమె తలలో పూలు తురిమే ప్రతిసారి అతను ఆ ప్రశ్నే అడుగుతాడు. ఆమె ఆ ఒక్క సమాధానమే చెబుతుంది.

పార్వతికి మల్లెపూలంటే అంత ప్రీతి కనుకే బుచ్చిబాబు అంత త్వరగా ఇల్లు చేరుకున్నాడు.

'రాజా! నన్ను మర్చిపోయేననుకున్నాను. ఇలా వెదుక్కుంటూ వస్తావని ఊహించలేదు.'

'ఈ అపరంజి బొమ్మను మరిచిపోవడమా? ఛ.. ఛ...' నువ్వు కనిపించకపోయేసరికి నేను దేవదాసునయిపోయానంటే నువ్వు నమ్మవేమో?...పారూ! ఆ విరహం...ఆ బాధ.. అబ్బా! తలచుకుంటే ఒళ్ళు జలదరిస్తుందనుకో.'

'ఊఁ...తర్వాత?'

'అవునమ్మా మీ ఆయన నాకంటె అందంగా ఉంటాడా?'

'ఊహూఁ!...నువ్వే అందంగా ఉంటావు' పార్వతి పొట్ట చెక్కలయ్యేలా నవ్వింది.

'అమ్మాయిగారికి పెళ్ళయింది. ఈ ప్రియుణ్ణి మరిచిపోయింది. నా దురదృష్టాన్ని ఏమని శపించను? ఎంతని తిట్టుకోనూ?'

'లేదు, రాజా! నిన్ను తలచని రోజంటూ నాకుండదు. నా పెళ్ళికి వస్తావని ఎంతో ఆశతో ఎదురు చూశాను.'

బుచ్చిబాబు గుమ్మంలో అడుగుపెట్టేసరికి అతనికి లోపలనుండి వినబడిన మాటలవి, తర్వాత నవ్వులూ... పరిహాసాలూ...అతని చేతిలో మల్లెపూలు నలిగి కిందికి జారిపోయాయి. అతని శరీరంలో కోపం 'లావా'లా ఊరింది. ఒక్క గుద్దుతో తలుపులు తెరచి, లోపల తన పార్వతితో ఉన్న ఆ రాజుగాడిని నాశనం చేయాలనుకున్నాడు.

కానీ, అతనలా చేయలేకపోయాడు. వాళ్ళ మాటలు ఎక్కువసేపు వినలేకపోయాడు. నెత్తిమీద మంచు ముక్కలు పడుతున్నట్లు, కాళ్ళకింద నిప్పురవ్వలు మండుతున్నట్లు, కథల్లో, సినిమాల్లో, కథానాయకులమల్లే ఫీలయ్యాడు. వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

అంతే!

అదే రోజున బుచ్చిబాబు మనసు ముక్కలైపోయింది. హృదయం బండబారిపోయింది.

బుచ్చిబాబుది ప్రేమ వివాహం. అతడు కాలేజీలో చేరుతూనే ఓ పెద్ద ఆశయం మనసులో పెట్టుకున్నాడు, 'ప్రేమించి పెళ్ళిచేసుకోవాలని.' కానీ, ఆ ఆశయం రెండేళ్ళవరకు నెరవేరలేదు. అందుకు కారణం, తన మనసూహించుకున్న చిత్తరువు ఏ అమ్మాయిలో కనిపించకపోవడమే. ఆ ఆశయం ఆశయంగానే ఉండిపోతుందేమోనని అతను భయపడటంకూడ కద్దు.

సెకెండియర్ బి యెస్సీ చదువుతున్న రోజుల్లో ఫస్టు టర్ములో ఓ కొత్తమ్మాయి బుచ్చిబాబు క్లాసులో చేరింది. ఆ అమ్మాయిని చూడగానే అతని మనసు నిండిపోయింది, ఆమెలో హరివిల్లు అందం ఉంది. ఆమె కళ్ళలో నీలాల వెలుగుంది. ఆమె పెదవులపై పగడాల చిరునవ్వులున్నాయి. తన మనసులో కల్పన ఓ రూపంగా వచ్చిందని భావించాడు. ఆ అమ్మాయి పేరు పార్వతి. ఆ పేరు విన్నప్పుడు ఆమె తన సొత్తే అనిపించింది.

'కృషితో నాస్తి దుర్భిక్షం'

బుచ్చిబాబు ఆమె నారాధించాడు.

పార్వతి అతన్ని ప్రేమించింది.

'అమ్మా నన్ను ఫలానా అమ్మాయి ప్రేమించింది. నేనామెను పెళ్ళి చేసుకుంటాను,' బుచ్చిబాబు తన పవిత్రమైన ప్రేమను మొట్టమొదటిసారిగా తనతల్లితో చెప్పాడు.

'ఒరేయ్ బుచ్చీ! ఈరోజు నిన్ను ప్రేమించినట్లే అంతకుముందెవర్నీ ప్రేమించలేదని నమ్మకం ఏమిట్రా?' ప్రేమంటే ఏమిటో తెలియనీ అమాయకురాలామె.

బుచ్చిబాబుకు నవ్వాగింది కాదు.

'పిచ్చిఅమ్మా! ప్రేమించడమనేది ఎవరికైనా జీవితంలో ఒకసారే జరుగుతుంది.'

ఆమె సరేనంది. అందరూ అంగీకరించటంవలన అట్టే యిబ్బందిలేకుండా అనుకున్న (ప్రేమించిన) పార్వతికి బుచ్చిబాబు మూడుముళ్లూ వేసి తనదానిగా చేసుకున్నాడు. తనారాధించిన అమ్మాయిని పొందినందుకు సంబరపడిపోయాడు.

ఆక్షణంమొదలు మొన్నటివరకు అతని సాంసారిక జీవితంలో యెటువంటి కలతలూ, కలహాలూ లేవనే చెప్పాలి. మూడుపూలు ఆరుకాయలు కాకపోయినా మూడుపూలూ మూడుకాయలుగా చల్లగా రోజులు గడిచిపోయాయి.

కానీ, మొన్నటిసంఘటన బుచ్చిబాబు జీవితాన్నే మార్చివేసింది. పార్వతి వంచన్ని వాస్తవంగా చూసిన అతను క్షణక్షణం దవాగ్నిలోపడి చూర్ణం అయిపోతున్నాడు, 'ఛ! ఎంత పొరపాటుచేశాను. ప్రేమించి పెళ్ళిచేసుకున్నందుకు మంచి శాస్తే జరిగింది' అని అనుకుంటున్నాడు. తనితల్లి చెప్పినమాటల్లో నిజాన్ని ఆలస్యంగా గ్రహించినందుకు తన్నుతానే చీదరించుకుంటున్నాడు.

పందిరివేసి, మల్లెతీగను మీదికి తీసుకురావాలనుకున్నంతలోనే, మల్లెతీగ పందిరినివిడిచి గడ్డిమొక్కలతో స్నేహం చేస్తుందని తనూహించలేకపోయాడు.

ఆ ఆలోచనలతోనే రాత్రంతా గడిపివేశాడు.

ఆరాత్రి పార్వతికూడ చాలసేపటివరకు నిద్రపోలేదు. ఎప్పుడూ తనభర్త తనతో కలతచెందలేదు. తనతో మాట్లాడటం మానలేదు. తనెప్పుడైనా కోపం నటించి అలిగితే_'నాముద్దు పొరుకదూ? నా చిట్టిపాపకదూ?' అని చిన్నపిల్లల్ని బుజ్జగించినట్లు ముద్దుముద్దుగా మాట్లాడి నవ్వించేవాడు. పాతజ్ఞాపకాలు గుర్తుకురాగానే పార్వతి కళ్ళు వర్షించాయి.

పెరుగు చిలికి వెన్న తీద్దామనుకున్న పాలు ఇంతలోనే విరిగిపోతాయని తనూహించలేకపోయింది.

రెండురోజులు గడిచాయి. బుచ్చిబాబు ముఖంలో రంగులు 'ఫాస్టుకలర్స్'గా మారిపోయాయి. పార్వతి ఆ రంగుల్లో దాగిన విషయమేమిటో తెలుసుకోలేకపోయింది.

ఆరోజు ఉదయం ఎనిమిది గంటలయింది. బుచ్చిబాబు మేడదిగి రాలేదు. పార్వతి మేడమీదికివెళ్ళి మెల్లగా భర్తను లేపింది. అతను గబగబా మేడ దిగి వచ్చి కాలకృత్యాలు పూర్తిచేశాడు. అతను స్నానం చేసి వచ్చేసరికి, పార్వతి అతని కావలసినబట్టలు, టై, వగయిరా సిద్ధంగావుంచి, కాఫీ టిఫెను తీసుకురావటానికి వంటగదిలోకి వెళ్ళింది.

ఆమె తీసివుంచిన బట్టల్ని బుచ్చిబాబు ముట్టలేదు. మరో జతతీసి తొడుక్కున్నాడు, సింపిల్‌గా హవాయి చెప్పులు తొడుక్కొని, అద్దంముందు నిల్చొని క్రాపు దువ్వుకుంటున్నాడు.

కాఫీ టిఫిన్ తీసుకువచ్చిన పార్వతి అతన్నిచూసి ఆశ్చర్యపోయింది. 'తను తీసివుంచిన బట్టలేం చేశాయో?' అనుకుంది. చాల బాధపడింది.

'కాఫీ టిఫిన్ తీసుకోండి'

'...... ...'

'ఎన్నాళ్ళిలా ఉపవాసాలు చేస్తారు?'

'ఉపవాసాలు చెయ్యవలసినఖర్మ నాకులేదు. ఊళ్ళో కావలసినన్ని హోటలున్నాయి' బుచ్చిబాబు చేతిలోని నువ్వేన కిందపడి రెండుముక్కలయింది. టేబుల్ సొరుగులాగి, ఫైళ్లు పైకితీసి విసురుగా వీధివేపు నడిచాడు.

క్షణంకాలం ఏమీ మాట్లాడలేక పార్వతి చూస్తూ ఉండిపోయింది.

'ఈరోజయినా త్వరగా వస్తారా?' చాల మంద్ర స్థాయిలో పార్వతి నోటివెంట వచ్చిందీమాట, గుమ్మం దాటిపోతున్న బుచ్చిబాబు చుర్రున వెనక్కితిరిగి, ఫళ్లు ఫటపటా కొరికాడు.

(తరువాయి 64వ పేజీలో)


ELLEN

ఎలెన్ మోటార్లు మరియు పంపులు

ఆంధ్రప్రభుత్వముచే అధికారము పొందియున్నది.



*Manufacturers of :—*

* Single Phase Motors. * 3 Phase Motors * Centrifugal Pumps. and * Domestic Pumps. * Domestic Mono Block.



*for Particulars :—*

**ELLEN INDUSTRIES**

**Peelamedu : : Coimbatore 4.**

: బ్రాంచి :

ఎలెన్ ఇండస్ట్రీస్

7-8-177, ఘన్‌మండి

సికిందరాబాదు-3 (ఎ. పి.)

మన దేశంలో ఈవిధంగా కృషిచేస్తుంటే మన మెంతో విస్మయం చెందాలి, పండు ముదుసలి అయినప్పటికి ఇప్పటికి మారుమూల గ్రామాల్లోకి వెల్లి పల్లెప్రజలతో గడుపుతుంది, యునెస్కో-వారు చేపట్టిన అక్షరాశ్యత కార్యక్రమంలో మన దేశంలో 100 బ్లాకులు తీసుకున్నారు. అందులో మన ఆంధ్రప్రదేశ్ లోని షాద్ నగర్ ఒకటి. క్రొత్తగా అక్షరాస్యులైనవారికోసం ఫిషర్ గారు, దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు అవిరళకృషి చేస్తున్నారు. దేశంలో మనకు కనిపించని ఒక పెద్ద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఫిషర్ గార్ని అభినందించక తప్పదు. ఈమెను ఆదర్శంగా తీసుకుని మన దేశంలో దారిద్ర్యం, నిరక్షరాశ్యత నిర్మూలన చేయగలిగితే అప్పుడుగాని ఫిషర్ గారు చేపట్టిన కార్యక్రమం పూర్తిగాదు. ఆనాడె నవసమాజానికి నాంది.

'ముదితల్ నేర్వగ రాని విద్యగలదే'

---

(61వ పేజీ తరువాయి)

'ఏం, ఈరోజు మీరాజాగాడు రానన్నాడా?' చాల కసిగా పలికాడు.

పార్వతి తుళ్ళిపడింది.

రాజు ..రాజు...రాజు ఆమె మస్తిష్కంలో ఆ రెండక్షరాలు పదే పదిపార్లుగా పరిభ్రమించాయి. బెదిరిపోయింది. కానీ, క్షణంలో ఏదో గురుతుకురాగానే తమాయించుకుం దామె.

'వస్తానన్నాడు. మీరుకూడ త్వరగా రావాలి!' మొహం సీరియస్ గా పెట్టింది.

భార్యను తన్నాలన్నంత కోపం కలిగింది బుచ్చిబాబుకు. అతనికి ఓర్పు ఎక్కువ గనుక ఆపని చేయలేకపోయాడు. బిగించిపిడికిలి జేబులోదూర్చి, అక్కడనుండి విసురుగా వెళ్ళిపోయాడు.

ఆఫీసులో ఏడుగంటలు ఏడు యుగాల్లా బరువుగా గడిచాయి. పనిచేస్తున్నా, బుచ్చిబాబు బుర్రలోని ఆలోచనలకు సరైన సమాధానాలు వెతుక్కుంటున్నాడుకూడ.

'రాజు వస్తానన్నాడు, మీరుకూడ త్వరగా రావాలి!' ఈమాటలు తనకు వెక్కిరించినట్లే ఉన్నాయి. 'మీరంటే నాకిష్టంలేదు, రాజుతో వెళ్లిపోతున్నాను. మీకు విడాకులిస్తాను' అని పార్వతి చెప్పుతుందేమోనని కొంచెం భయపడ్డాడు.

పార్వతి కెంత ధైర్యం. తనను ప్రేమించిందని నమ్మాడు. ఆమెలో కుటిలస్వభావం గూడు కట్టుకొని ఉందని ఒక్కనాడూ ఊహించలేదు. 'అమ్మా! నువ్వెక్కడున్నావమ్మా? నీమాటలో నిజాన్ని తెలుసుకోలేకపోయాను' అని వలవల యేడ్చాడు, బుచ్చిబాబు తను ఆఫీసులో వున్నాడనే సంగతికూడ మరచి, అదృష్టం బావుందిగనుక తన ఏడ్పెవరూ వినలేదు.

చివరకు తనలో ఓ మొండిధైర్యం అతనికి ధైర్యం చెప్పింది. తనజీవితంలో చీకట్లు విరజిమ్మిన ఆ రాజుగాడి ప్రాణాలుతీయాలని నిర్ణయించుకున్నాడు.

'టంగ్ టంగ్' మని అయిదుగంటలు వినిపించింది గోడమీది గడియారం. గబగబా ఫైళ్లుసర్ది బయట పడ్డాడు బుచ్చిబాబు. పదోనెంబరు బస్సెక్కి పావుగంటలో ఇల్లుచేరుకున్నాడు.

వీధితలుపులు వేసివున్నాయి. లోపల రాజూ పార్వతీ గుసగుసలు చెప్పుకుంటున్నారు. మధ్యమధ్య పెంకు రెగి రేలా నవ్వుకుంటున్నారు.

బుచ్చిబాబులో సహనం చచ్చిపోయింది, బలమంతా ప్రయోగించి పిడికిలితో తలుపులుమీద ఓగుద్దు గుద్దాడు. తలుపులు తెరుచుకున్నాయి. విసురుగా గదిలోకి అడుగు పెట్టాడు శేవురించిన కళ్ళతో.

బుచ్చిబాబు ఆశ్చర్యబోయాడు రాజును చూసి. పిచ్చిగా పార్వతిముఖంలోకి చూశాడు.

'ఈమె నా స్నేహితురాలు. గుంటూరులో చదువుకున్నప్పటి నా క్లాస్ మేట్. పేరు రాజ్యలక్ష్మి. ఈ ఊళ్ళో వాళ్ళ బాబాయిగారున్నారు. వాళ్ళను చూడ్డానికి వచ్చింది. లక్కీగా పాతస్నేహితులం కలుసుకున్నాం ..' పార్వతి ఇంకా ఏదేదో చెప్పుకుపోతుంటే, బుచ్చిబాబు వినలేకపోయాడు. తన అనుమానానికి సిగ్గుతో కుంచించుకుపోయాడు. అక్కడ నిలబడలేకపోయాడు.

మగవాళ్ళవలె ఆమెకు స్వరంలో 'ఫ్రీక్వెన్సీ' తక్కువని బుచ్చిబాబు కేం తెలుసు?

పార్వతి విరగబడి నవ్వుతోంది.

ఇదేమీ అర్థంకాక భార్యాభర్తల ఇద్దరివేపు, ఆశ్చర్యంగా చూసింది, రాజు అంటే రాజ్యలక్ష్మి,